తనకి వచ్చిన 'అఫీషియల్ లెటర్'ని ఆత్రంగా చదివి నీరసపడిపోయాడు సబ్-ఇన్‌స్పెక్టర్ రాఘవ.

'ప్రస్తుతానికి ఇక్కడే సర్వీసు కొనసాగించు' - అని కమిషనర్ నుంచి వచ్చిన లెటర్ అది.

ప్రస్తుతం వన్ టౌన్ ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్నాడు రాఘవ. ఆ సర్కిల్ వాతావరణం ఏ మాత్రం నచ్చలేదతనికి. అందుకే త్రీ టౌన్‌కి తనని ట్రాన్స్‌ఫర్ చేయమని పోలీస్ కమిషనర్‌కి అప్లికేషన్ పెట్టాడు. త్రీ టౌన్ సర్కిల్లో రెండు చేతులా సంపాయించవచ్చు! ఎటువంటి పొలిటికల్ ఇన్‌ఫ్లుయెన్సూ వుండదు!! అందుకే త్రీ టౌన్‌కి ట్రాన్స్‌ఫర్ కావడానికి ఇప్పటికి 20 వేలు ఖర్చుపెట్టాడు. అయినా ప్రయోజనం లేకపోయింది ప్రస్తుతం వచ్చిన లేఖను చూస్తుంటే.



[illegible] పడ్డ శ్రమ అంతా వృథా అయింది.

ఇంతలో కానిస్టేబుల్ వెంకటస్వామి వచ్చి చెప్పాడతనికి.

"సార్! ట్రాఫిక్ డి.యస్.పి. గార్నుంచి మెసేజ్ వచ్చింది. ఈ రోజు ట్రాఫిక్ అబ్జర్వేషన్‌కి వెళ్ళి 'హెల్మెట్' ధరించని వాహన చోదకులను పట్టి 'ఫైన్' వడ్డించాలట!"

కోపంగా లాటీతో బల్ల మీద కొట్టి, ఆవేశంగా లేచాడు రాఘవ. "దొంగ.....దుకులు... 'హెల్మెట్' లేకుండా మోటార్ వెహికల్స్ నడిపి మనకి 'న్యూసెన్స్' అవుతున్నారు. పద... ఈ రోజు అటువంటి కొడుకుల అంతు చూడాలి!" అంటూ బైక్ వద్దకు నడిచాడతను.

అసలే ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ పంపలేదని కమిషనర్ (గాడి) మీద కోపంగా వుంది! ఇంతలో డి.యస్.పి. నుంచి మెసేజ్!!


హెల్మెట్ లేని వాళ్ళని పట్టి, చితకబాది తన 'కసి'ని తీర్చుకోవాలనుకున్నాడు...!!!

* * * *

ఆ వారానికి ఓ లక్ష రూపాయిల్ని జరిమానా క్రింద జనాల్నుంచి వసూలు చేయాలని దీక్ష పూనింది ట్రాఫిక్ పోలీసు డిపార్ట్‌మెంట్. అందుకే 'హెల్మెట్' లేని వారిని పట్టి, 'తల' ఒక్కింటికి యాభై రూపాయిలు వసూలు చేయాలని పోలీస్ వారు నిర్ణయించుకున్నారు.

అప్పటికి దాదాపు గంట గడిచిం ది. చెమట ధారాపాతంగా కారుతూ రాఘవలో అసహనాన్ని పెంచుతోంది. నాలుగు రోడ్ల కూడలి వద్ద నిలబడి ఓ ఇద్దరికి ఫైన్ వేశాడు అప్పటికే.

ఇంతలో దూరంగా స్కూటర్ మీద ఓ బట్టతల



టి. శశిధర్ కుమార్

స్పీడుగా రాసాగింది. నో డౌట్... వీడికి హెల్మెట్ లేదు!!

స్కూటరిస్ట్ ఆగాడు. అతని మెడలో వేలాడుతున్న 'కెమెరా'ని చూడగానే అతనో జర్నలిస్ట్ అనీ, 'ప్రెస్' వాడనీ గ్రహించాడు రాఘవ.

సరిగ్గా అప్పుడే అతడిలో ఓ 'ప్లాన్' ఫ్లాష్‌లా తట్టింది. దానిన అమలుపరచాలని నిర్ణయించుకున్నాడు రాఘవ.

ఆ జర్నలిస్ట్ రాఘవతో "సారీ సర్..., హెల్మెట్ లేనందుకు ఫైన్ కట్టించుకోండి. నేను 'ఈవేళ' దిన పత్రిక విలేకరిని" అంటూ పర్సు తీశాడు జేబులోంచి.

రాఘవ అతడి మాటల్ని పట్టించుకోలేదు. ఆ స్కూటరిస్ట్ కమ్ జర్నలిస్ట్‌ని ఇవతలికి లాగిపారేసి, "హెల్మెట్ ఎందుకు పెట్టుకోలేదురా దొంగ రాస్కెల్... నువ్వు ప్రెస్ వాడివైతే నాకు భయమా?" అంటూ లాఠీతో బాదాడు.

"ఫైన్ కడతాను... నన్ను వదలం డి" అని ఆ ప్రెస్ అతను అంటున్నా వినిపించుకోకుండా, లాకప్‌లో పడేసి, మళ్ళీ ఇంకోసారి అతడ్ని ఉతికి, వెంటనే వెంకటస్వామికి స్టేషను అప్పగించి బయటికెళ్ళిపోయాడు రాఘవ.

అరగంట తర్వాత ఓ వంద మంది విలేకరులు నినాదాలు చేస్తూ, కాసేపు ధర్నా జరిపి, రాఘవని వెంటనే సస్పెండ్ చేయాలని, లేదా ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరుతూ హోం మంత్రికి, కమిషనర్ ఆఫ్ పోలీస్‌కు మెమొరాండం సమర్పించారు.

ఇక్కడే హోం మినిస్టరూ, కమిషనరూ తికమక పడ్డారు. రాఘవకి గత రికార్డులో ఒక్క 'రిమార్కు' లేదు! ప్రస్తుతం ఇదొక్కటే!! కనుక అతడ్ని సస్పెన్షన్‌లో వుంచడానికి వీల్లేదు! పోలీసుల్లోంచి ప్రతిఘటన ఎదురవ్వొచ్చు ఆ చర్య తీసుకుంటే. ఇక మిగిలింది ట్రాన్స్‌ఫర్ సంగతి.

సరిగ్గా అప్పుడే 'తనను త్రీ టౌన్‌కి ట్రాన్స్‌ఫర్ చేయమని' రాఘవ పెట్టుకున్న అప్లికేషన్ వారి కంట పడింది!

'బతుకు జీవుడా!' అనుకుంటూ అతడ్ని అంటే రాఘవని త్రీ టౌన్‌కి ట్రాన్స్‌ఫర్ చేసి పారేశారు!!

ఆ ఆర్డర్స్ వెంటనే అమలులోకొచ్చేశాయి!!!

* * * *

త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌లో కాలు మీద కాలు వేసుకుని విశ్రాంతి తీసుకుంటున్నాడు రాఘవ.

'కొడుకులు... (పోలీసు కమిషనరూ, హోం మినిస్టరూ)... ఇప్పటికి మాట విని 'ట్రాన్స్‌ఫర్' చేశారు. ఏ పని జరగాలన్నా, జనాన్ని చితకబాది తెలివి బ్లాక్ మెయిల్ చేస్తే సరి. 'పని' అయిపోతుంది... ' అని అప్పటికి ఏ పదమూడోసారో అనుకున్నాడు రాఘవ.

తరువాత ఆ జర్నలిస్ట్‌ని కలిసి 'సంగతి' వివరించి ఓ వేయి అతనికి సమర్పించి, తనపై అతను కేసు పెట్టకుండా చూసుకున్నాడు రాఘవ. అయితే అది వేరే విషయం...!!!

ఈ బహుమతి పొందిన రచనలలో మీకు నచ్చిన కాలమ్ దాటని కథ వివరాలు దిగువ ఇచ్చిన కూపన్‌లో నింపి, పోస్ట్ కార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.

- ఎడిటర్

ఈ సంచికలో నాకు నచ్చిన కథ: ---------------

రచయిత/ రచయిత్రి: ---------------

పేజీ నంబరు: ---------------